## నేడు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవం

నిజాంపేట్: నిజాంపేట్ కార్పొరేషన్ 2వ డివిజన్‌లో శనివారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఎమ్మెల్యే వివేకానంద్, ఎమ్మెల్సీ శంభీపూర్‌రాజులు ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించనున్నట్లు స్థానిక కార్పొరేటర్ చిట్ల దివాకర్ ఓ ప్రకటనలో తెలిపారు. విజయదుర్గ కాలనీ జీపీఆర్ లేవుట్, సింహపురికాలనీ, రుద్రకుటీర్, వీఎస్ఆర్, ఆర్కే లేఅవుట్, ఎస్‌వీఎల్ఎన్ ప్రైడ్‌లలో సీసీ రోడ్లను మేయర్ నీలారెడ్డి, డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్‌లతో కలిసి ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు.

## కాంగ్రెస్ సీనియర్ నేత సువ్వారి శ్రీనివాస్ మృతి



సువ్వారి శ్రీనివాస్ పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న కొలన్ హన్మంతరెడ్డి

రంగారెడ్డినగర్: మాజీ టీపీసీసీ సెక్రటరీ, రంగారెడ్డినగర్ డివిజన్ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు సువ్వారి శ్రీనివాస్ శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ కొలన్ హన్మంతరెడ్డి రంగారెడ్డినగర్‌లోని ఆయన నివాసానికి వెళ్లి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హన్మంతరెడ్డి మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ శ్రీనివాస్ కుటుంబానికి అండగా ఉంటుందన్నారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటన్నారు.

## బకాయిల వడ్డీలపై 90 శాతం రాయితీ

నిజాంపేట్: పెండింగ్‌లో ఉన్న ఆస్తి పన్ను బకాయిల వడ్డీపై రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రాయితీని సద్వినియోగం చేసుకోవాలని నిజాంపేట్ కార్పొరేషన్ కమిషనర్ రామకృష్ణరావు అన్నారు. శుక్రవారం ఆయన కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ.. పెండింగ్ బకాయిలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. రెవెన్యూ వసూళ్లను రాబట్టేందుకు బకాయిల వడ్డీలపై 90 శాతం రాయితీని ప్రకటించిందన్నారు. నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని గృహ, కమర్షియల్ భవనాల యజమానులు బకాయిలను వెంటనే చెల్లించి ప్రభుత్వం అందిస్తున్న వడ్డీ రాయితీని పొందాలని కమిషనర్ కోరారు.

## 1.4 కిలోల గంజాయి పట్టివేత

ముగ్గురు విక్రయదారుల రిమాండ్



ఎస్‌ఓటీ పోలీసులు స్వాధీనం చేసుకున్న గంజాయి ప్యాకెట్లు



పట్టుబడ్డ బ్రిజేష్ కుమార్ పాండే



నందిగాయ సాయితే, శ్రీనివాస్

సుభాష్‌నగర్: సైబరాబాద్ ఎస్‌ఓటీ పోలీసులు 1.4 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని ముగ్గురు విక్రయదారులను రిమాండ్‌కు పంపారు. బాలానగర్ ఎస్‌ఓటీ పోలీసులకు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు సూరారం పోలీస్‌స్టేషన్ పరిధిలోని గాజులరామారం కైసర్‌నగర్‌లోని బ్రిజేష్ కుమార్ పాండే ఇంట్లో దాడులు నిర్వహించగా 650 గ్రాముల గంజాయి ప్యాకెట్లు లభ్యమయ్యాయి. అదే విధంగా మేడ్చల్ ఎస్‌ఓటీ టీమ్ కేపీహెచ్‌బీ పీఎస్ పరిధిలోని శ్రీవేదా హాస్టల్‌లో ఉంటున్న నందిగామ సాయితేజ, కొత్తపల్లి నాగశ్రీనివాస్‌ల నుంచి 750 గ్రాముల గంజాయిని సీజ్ చేశారు. వీరు గత కొంత కాలంగా కళాశాలలు, కూలీల అడ్డాల వద్ద గంజాయిని విక్రయిస్తున్నట్లు తెలిసింది. నిందితులపై కేసులు నమోదు చేసిన పోలీసులు శుక్రవారం వారిని రిమాండ్ చేశారు.

## సాంకేతిక విప్లవంతో భారత్ ముందంజ

సనత్‌నగర్: సాంకేతిక పరిజ్ఞానం భవిష్యత్తులో సామాజిక, ఆర్థిక అంతరాలను తగ్గించే అవకాశం ఉందని ఢిల్లీకి చెందిన రీసెర్చ్ అండ్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ డెవలపింగ్ కంట్రీస్ (ఆర్ఐఎస్‌డీసీ) డైరెక్టర్ జనరల్ ప్రొఫెసర్ సచిన్ చతుర్వేది అభిప్రాయపడ్డారు. ఆర్థిక, సామాజిక అధ్యయన కేంద్రం (సెస్) వ్యవస్థాపక దినోత్సవం శుక్రవారం సెస్ ఆడిటోరియంలో జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన సచిన్ చతుర్వేది 'సాంకేతికతతో సమానమైన అభివృద్ధి–ప్రపంచ దక్షిణ భారతదేశం అనుభవం' అనే అంశంపై మాట్లాడారు. మన దేశం సాంకేతికపరంగా మరింత అభివృద్ధి చెందాలంటే వ్యూహాత్మక–ప్రణాళిక, భాగస్వామ్య అభివృద్ధి, సామర్థ్యాలను మెరుగుపరచడంతో పాటు ఆరోగ్యం, వ్యవసాయం, బ్యాంకింగ్‌తో పాటు కీలక రంగాల్లో అడ్డంకులను తొలగించడం ఎంతో కీలకమన్నారు. సాంకేతిక పురోగతిలో భారతదేశ నాయకత్వాన్ని ఎలుగెత్తి చూపడమే కాకుండా ప్రపంచ దక్షిణాది దేశాలకు సాంకేతిక పరిజ్ఞాన నిధిని అందించిందన్నారు. డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (డీపీఐ), డిజిటల్ పబ్లిక్ గూడ్స్ (డీపీజీ) అనేవి ప్రభుత్వ పెట్టుబడితో ఆవిర్భవిస్తాయన్నారు. డిజిటల్ చెల్లింపుల రంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయన్నారు. ఆధార్ యూనిఫైడ్ పేమెంట్ ఇంటర్‌ఫేస్ (యూపీఐ), కోవిడ్, ఆయుష్మాన్ భారత్, డిజిటల్ మిషన్ వంటి కార్యక్రమాలు డిజిటల్ విప్లవానికి చిహ్నామన్నారు. సాంకేతిక విప్లవాభివృద్ధిపై ఆర్థిక, సామాజిక అంశాల అధ్యయన కేంద్రం అధ్యాపకులు విశ్లేషణాత్మకంగా పరిశోధనలు చేయాలని చతుర్వేది పిలుపునిచ్చారు.

## సవాళ్ల పరిష్కారానికి సాంకేతికతను ఉపయోగించాలి

యూజీసీ చైర్మన్ ప్రొఫెసర్ ఎం జగదీష్‌కుమార్

రాయదుర్గం: ప్రపంచ వ్యాప్తంగా ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సవాళ్లకు పరిష్కారాలను కనుగొనడానికి సాంకేతిక పురోగతిని ఉపయోగించాలని యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) చైర్మన్ ప్రొఫెసర్ ఎం జగదీష్‌కుమార్ పేర్కొన్నారు. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూలో ఇన్నోవేటివ్ రీసెర్చ్ ఎంటర్‌ప్రైజెస్(ఎస్పైర్) అసోసియేషన్ ఫర్ సైంటిఫిక్ పర్స్యూట్స్ 6వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. ప్రస్తుతం జీవ వైవిధ్యం మరొక ముఖ్యమైన సమస్యగా మారిందని, దీన్ని పరిక్షించడానికి అందరూ కృషి చేయాలన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విధులను సక్రమంగా నిర్వహిస్తూనే ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నా రు. మన దేశంలో మహిళలు సాధిస్తున్న ప్రగతిని మనం చూడాల్సిన అవసరం ఉందన్నారు. వ్యవసాయ ఉత్పత్తులు పెంచడంలో రైతులకు అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో వైస్‌చాన్స్‌లర్ ప్రొఫెసర్ బీజేరావు ఎస్పైర్ బయోనెస్ట్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ డాక్టర్ అనీల్‌కొండ్రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఫాక్స్‌సాగర్‌ను.. పర్యాటక కేంద్రంగా మార్చాలి



ఫాక్స్‌సాగర్‌లో చేపలు పడుతూ..



సెలవు దినాల్లో ఫాక్స్‌సాగర్ చెరువు కట్టపై పర్యాటకులు

సుభాష్‌నగర్: నగరంలోని ప్రధాన అతిపెద్ద చెరువులలో జీడిమెట్ల గ్రామాన్ని ఆనుకొని ఉన్న ఫాక్స్‌సాగర్‌గా చెప్పుకోవచ్చు. ఒకప్పుడు స్వచ్ఛమైన నీటితో సాగు, తాగునీటిని అందించిన ఈ చెరువు ప్రస్తుతం కలుషిత కోరల్లో జీడిమెట్ల పారిశ్రామికవాడ నుంచి 44వ జాతీయ రహదారి వరకు కిలోమీటర్ మేర విస్తరించి ఉన్న ఈ చెరువు కట్టపై నిత్యం వందల సంఖ్యలో రాకపోకలు సాగిస్తుంటారు. ప్రస్తుతం సెలవు దినం వచ్చిందంటే ఈ చెరువు కట్టను చూడడానికి వందల సంఖ్యలో పర్యాటకులు వస్తున్నారు. కానీ అధికారులు, ప్రభుత్వం పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దడంలో ఆలోచన పెట్టలేకపోతుంది.

◆ గతంలో పలుమార్లు ఫాక్స్‌సాగర్‌ను పర్యాటక కేంద్రంగా చేస్తామని ప్రతిపాదనలు చేసిన ఆచరణలో మాత్రం సాధ్యం కాలేకపోయింది. అయినప్పటికీ పర్యాటకులు మాత్రం వస్తూనే ఉన్నారు. ఫాక్స్‌సాగర్‌లో కాలుష్య జలాలు చేరకుండా చర్యలు తీసుకుని పర్యాటక కేంద్రంగా చేస్తే చెరువుకు పూర్వవైభం తీసుకురావడమే కాకుండా ప్రభుత్వానికి ఆదాయం సమకూరే అవకాశం ఉంది.

◆ **ఫాక్స్‌సాగర్ చరిత్ర...**

బొల్లారంలో ఉన్న ఆర్మీ సైనికుల తాగునీటి అవసరాల నిమిత్తం అప్పటి ఆర్మీ అధికారి ఫాక్స్ జీడిమెట్లలో 482 ఎకరాల విస్తీర్ణంలో వందేళ్ల క్రితం చెరును తొవ్వించాడు. ఆ చెరువుకు ఫాక్స్ సాగర్‌గా నామకరణం చేశాడు.

◆ **అప్పట్లో...**


జీడిమెట్ల, కొంపల్లి, దూలపల్లి గ్రామాలని ఆనుకొని ఉన్న ఈ చెరువు అప్పట్లో స్వచ్ఛమైన నీటితో కలకలలాడేది. పాడిపంటలకు, తాగు నీటి, జాలర్ల ఉపాధి నిమిత్తం ఎంతగానో ఉపయోగపడేది.

◆ **ప్రస్తుతం...**

482 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న చెరువును పట్టించుకునే నాథుడే కరువయ్యాడు. ప్రస్తుతం సగం వరకు కబ్జా చేసి నిర్మాణాలు చేపట్టారు. ఇక దూలపల్లి, జీడిమెట్ల పారిశ్రామిక వాడలను ఆనుకొని ఉన్న వైపు ఎంచక్కా గోదాములు వేసి అందులో అత్యంత ప్రమాదకరమైన రసాయనాల డ్రమ్ములను నిలువ చేసి దందాను కొనసాగిస్తున్నారు. గత రెండు సంవత్సరాల వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలకు ఫాక్స్‌సాగర్ పరిసర ప్రాంతాల్లో నిర్మాణాలు నీట మునగడంతో కబ్జా బాగోతం బయటపడింది. అయినప్పటికీ శరణు రక్షించడానికి అధికారులు ఆ దిశగా ప్రయత్నాలు చేయడంలో విఫలమవుతున్నారు.

◆ **ఇలా చేస్తే బాగుంటుంది..**

కిలోమీటర్నరా పొడవున్న చెరువు కట్టను విస్తరించి పర్యాటకులు చెరువు అందాలను వీక్షించే విధంగా బెంచీలు ఏర్పాటు చేయాలి. చెరువులో పెరిగిన గుర్రపు డెక్కను తొలగించాలి. చెరువులో మురుగు, రసాయన వ్యర్థాలు కలవకుండా చూడాలి. కబ్జాకు గురైన స్థలాన్ని కాపాడాలి. చెరువు చుట్టూ ట్యాంక్‌బండ్ మాదిరిగా ట్రాక్ ఏర్పాటు చేయాలి. చెరువు పరిసర ప్రాంతాల్లో పర్యాటకుల ఉపయోగార్థం పార్కింగ్ ఏర్పాటు చేయాలి. ఇలా చేయడం ద్వారా వివిధ షాపులు, హోటల్లు రావడం ద్వారా ప్రభుత్వానికి ఆదాయం సమకూరుతుంది.



ఫాక్స్‌సాగర్ చెరువు కట్టపై నిర్మాణం

## ఆటో కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకోవాలి

సుభాష్‌నగర్: ఆటో కార్మికులను రాష్ట్ర ప్రభుత్వం ఆదుకుని ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలను చూపాలని కుత్బుల్లాపూర్ మండల సీఐటీయూ కన్వీనర్ కీలుకాని లక్ష్మణ్ అన్నారు. తెలంగాణ ఆటో డ్రైవర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం దేవేందర్‌నగర్‌లో నూతన ఆటోస్టాండ్ ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. కొన్ని సంవత్సరాలుగా ఓలా, ఉబర్ లాంటి ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్‌లతో ఆటో డ్రైవర్ల బతుకులు దుర్భరంగా మారాయని అన్నారు.

◆ దీనికి తోడు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో 'మూలిగే నక్కపై తాటికాయ పడ్డ'చందంగా ఆటో డ్రైవర్ల పరిస్థితి మారిందన్నారు. దీంతో ఆటో కార్మికుల కుటుంబాలు రోడ్డు మీద పడ్డాయని అన్నారు. ప్రైవేట్ ఫైనాన్షియల్ ఆగడాలు తట్టుకోలేక డ్రైవర్లు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.





దేవేందర్‌నగర్‌లో ఆటో యూనియన్ జెండాను ఎగుర వేస్తున్న లక్ష్మణ్ తదితరులు

◆ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఆటో కార్మికులకు సమగ్ర చట్టం చేయాలన్నారు. అదే విధంగా సామాజిక భద్రత కల్పించాలన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్, పెన్షన్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఆటో యూనియన్ అధ్యక్షుడు ఖలీల్, సీఐటీయూ జీడిమెట్ల క్లస్టర్ నాయకులు అంజయ్య, దేవేందర్‌నగర్ ఆటో యూనియన్ అధ్యక్షుడు శ్రీనివాస్, నాగరాజు, సత్యనారాయణ, కృష్ణ తదితరులు ఉన్నారు.

## రాయితీని గృహ యజమానులు సద్వినియోగం చేసుకోవాలి

కుత్బుల్లాపూర్: ఆస్తి వడ్డీపై రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న రాయితీని గృహ యజమానులు సద్వినియోగం చేసుకోవాలని కొంపల్లి మున్సిపల్ కమిషనర్ శ్రీహరి ఓ ప్రకటనలో కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఆస్తి పన్ను వడ్డీ మాఫీ కోసం వన్‌టైమ్ సెటిల్‌మెంట్ అమలు పరుస్తోందని బకాయిల వడ్డీపై 90 శాతం మాఫీ ఉంటుందన్నారు. మార్చి 31వ తేదీలోపు సకాలంలో బకాయిలు చెల్లించి వడ్డీపై రుణమాఫీ పొందాలనిన సూచించారు. మున్సిపల్ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని కమిషనర్ కోరారు.

## గృహజ్యోతి లబ్ధిదారులకు జీరో బిల్స్



వినియోగదారులకు జీరో బిల్స్ అందజేస్తున్న విద్యుత్ అధికారులు

దుండిగల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన గృహజ్యోతి పథకాన్ని విద్యుత్ శాఖ అధికారులు అమలు చేస్తున్నారు. అందులో భాగంగా 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నారు. దుండిగల్ మున్సిపాలిటీ డి.పోచంపల్లి, సారెగూడెం ప్రాంతాల్లో జీరో బిల్స్‌లను మేడ్చల్ ఎస్ఈ శ్రీరాం, జీడిమెట్ల డీఈ నర్సింహారెడ్డిలు పరిశీలించారు. వినియోగదారులకు జీరో బిల్స్‌లను అందజేశారు. కార్యక్రమంలో షాపూర్‌నగర్ ఏడిఈ వీరేశలింగం, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

## నేడు సబ్బండ వర్గాల ఆత్మగౌరవ సదస్సు

పంజగుట్ట: తెలంగాణలో అధికారంలోకి వచ్చి ప్రజా పాలన అందిస్తామని, సామాజిక న్యాయం పాటిస్తామని అన్న కాంగ్రెస్ పార్టీ రాజకీయ ప్రాతినిధ్యపు అవకాశాలు కేవలం ఒక్క సామాజికవర్గానికే పరిమితం చేస్తూ ఇతర వర్గాలను అపహాస్యం చేస్తున్నదని బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షుడు దాసు సురేష్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇదే అంశంపై చర్చించేందుకు శనివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సబ్బండ వర్గాల ఆత్మగౌరవ సదస్సు పేరుతో రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సమావేశానికి తెలంగాణ మేధావులు, ఉద్యమకారులు, నాయకులు, కళాకారులు, జర్నలిస్టులు, న్యాయవాదులు, ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

## రోడ్ల పక్కన భారీ పైపులు

వాహనదారులకు ఇబ్బందులు

రంగారెడ్డినగర్: రోడ్లపై ఎక్కడ పడితే అక్కడ కాంక్రీట్ వ్యర్థాలు, ఇతర సామగ్రిని డంప్ చేస్తూ రాకపోకలకు ఆటంకాలు సృష్టిస్తున్నా సర్కిల్ అధికారులు పట్టించుకున్న పాపాన పోవడం లేదు. రంగారెడ్డినగర్ డివిజన్ గాంధీనగర్–మారుతినగర్ రోడ్డులో కొన్ని రోజులుగా ఉన్న ఓ భారీ కాంక్రీట్ పైపు రాకపోకలకు ఆటకంగా మారుతోంది. దీనికి తోడు పైపు ను ఆనుకుని కొందరు వాహనాలను నిలుపుతున్నారు. సర్కిల్ అధికారులు దీనిపై స్పందించి వెంటనే సదరు పైపును తరలించి రాకపోకలు సజావుగా కొనసాగాలే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



గాంధీనగర్-మారుతినగర్ రోడ్డుపై ఉన్న భారీ కాంక్రీట్ పైపు

## ఎస్సీ వర్గీకరణతోనే మాదిగలు, ఉపకులాలకు న్యాయం

కుత్బుల్లాపూర్: ఎస్సీ వర్గీకరణతోనే మాదిగలు, ఉప కులాలకు న్యాయం జరుగుతుందని ఎమ్మార్పీఎస్ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు యాదగిరి మాదిగ అన్నారు. శుక్రవారం కుత్బుల్లాపూర్ సర్కిల్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఎస్సీ వర్గీకరణ కోసం ప్రాణత్యాగాలు చేసిన ఎమ్మార్పీఎస్ కార్యకర్తల చిత్రపటాలకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్, ఎమ్మెస్పీ నాయకులు మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణ కోసం కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఏడుగురు సభ్యులతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం అనుకూలంగా తీర్పు ఇస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్లుగా ఎదురు చూస్తున్న వర్గీకరణ దగ్గరలోనే ఉందన్నారు. ఆత్మబలిదానాలు చేసిన వారి త్యాగాలు వృథా కావన్నారు. ఈ కార్యక్రమంలో సిలివేరు శ్రీనివాస్ మాదిగ, రమేష్ మాదిగ, సలోని, లతా, రాణి, నరసింహులు, కురుమయ్య, బలరామ్ తదితరులు పాల్గొన్నారు.



## ధరణి సమస్యలను సత్వరమే పరిష్కరిస్తాం

కుత్బుల్లాపూర్ తహసీల్దార్ రెహమాన్‌ఖాన్



సుభాష్‌నగర్: పెండింగ్‌లో ఉన్న ధరణి దరఖాస్తుల సమస్యను సత్వరమే పరిష్కరిస్తామని కుత్బుల్లాపూర్ తహసీల్దార్ రెహమాన్‌ఖాన్ అన్నారు. ధరణి పోర్టల్‌లో పెండింగ్ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం తహసీల్దార్లకు అధికారాలు ఇవ్వడంతో ఆ ప్రక్రియను శుక్రవారం నుంచి కార్యాలయంలో మొదలుపెట్టారు. మండల పరిధిలోని ధరణి వెరిఫికేషన్లకు రెండు బృందాలను నియమించినట్లు తెలిపారు. – జీడిమెట్ల, పేట్‌బషీరాబాద్, సూరారం ప్రాంతాలకు గాను రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రేణుక, జూనియర్ అసిస్టెంట్ మమత, రికార్డ్ అసిస్టెంట్ సత్యం, గాజులరామారం, కుత్బుల్లాపూర్, నందానగర్ ప్రాంతాలకు గాను రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రజనీకాంత్, రికార్డ్ అసిస్టెంట్లు శ్రీనివాస్, బాల ప్రసాద్‌లను నియమించారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను పరిష్కరిస్తున్నామని అన్నారు. ఏదైనా అనుమానం ఉంటే తామే దరఖాసుదారులకు నేరుగా ఫోన్ చేస్తామని తహసీల్దార్ రెహమాన్ ఖాన్ తెలిపారు.

## ఉద్యోగావకాశాలు కల్పించడం అభినందనీయం





ఉద్యోగాలు పొందిన వారితో షెడ్యూల్డ్ కులాల కార్పొరేషన్ ప్రత్యేక అధికారి ఆనంద్‌కుమార్

దుండిగల్: నిరుద్యోగ విద్యార్థులకు ఉద్యోగావకాశాలు కల్పించడం అభినందనీయమని రాష్ట్ర షెడ్యూల్డ్ కులాల కార్పొరేషన్ ప్రత్యేక అధికారి బి.ఆనంద్‌కుమార్ అన్నారు. స్పార్స్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో వివిధ విభాగాల్లో 105 మందికి శిక్షణ తరగతులు నిర్వహించారు. వీరిలో 82 మంది వివిధ పరిశ్రమల్లో ఉద్యోగాలు సాధించారు. గండిమైసమ్మలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వారికి ఆనంద్‌కుమార్ నియామక పత్రాలను అందజేశారు. హాస్పిటల్ ఫ్రంట్ డెస్క్ కో–ఆర్డినేటర్, మెడికల్ రికార్డ్స్ అసిస్టెంట్, అకౌంట్ ఎగ్జిక్యూటీవ్‌లుగా ఉద్యోగాలు పొందారని నిర్వాహకులు పేర్కొన్నారు. కార్యక్రమంలో షెడ్యూల్డ్ కులాల కార్పొరేషన్ జిల్లా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ డి.బాలాజీ నాయక్, స్పార్స్ చైర్మన్ బి.చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల వర్ధంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలి

హిమాయత్‌నగర్: భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ ల 93వ వర్ధంతి కార్యక్రమాలను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ఘనంగా నిర్వహించాలని అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి వలి ఉల్లా ఖాద్రీ, కె.ధర్మేంద్ర డిమాండ్ చేశారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో జాతీయ ప్రధాన కార్యదర్శి ఆర్.తిరుమలై సమక్షంలో భగత్ సింగ్ 93వ వర్ధంతికి సంబంధించిన కరపత్రాన్ని శుక్రవారం నారాయణగూడలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... భగత్ సింగ్ జీవితం భారత దేశ యువతకు స్ఫూర్తిదాయకమని, అటువంటి మహనీయుని త్యాగాలను నేటి సమాజానికి తెలపాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. వారి వర్ధంతిని పురస్కరించుకొని రాష్ట్రవ్యాప్తంగా క్రీడోత్సవాలు, వ్యాస రచన, చిత్రలేఖన పోటీలు, సదస్సులు, ర్యాలీలు, కాగడాల ప్రదర్శన వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఏఐవైఎఫ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ నెర్లకంటి శ్రీకాంత్, రాష్ట్ర ఆఫీస్ బేరర్స్ లింగం రవి, నానబాల రామకష్ణ, యుగంధర్, పేరబోయిన మహేందర్, సత్య ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



## ఎయిర్‌వాల్వ్‌ల నిర్వహణ గాలికి.!



గాంధీనగర్‌కు వెళ్లే దారిలో అడ్డంగా ఉన్న ఎయిర్‌వాల్వ్

తాగునీటి సరఫరాలో కీలకంగా ఉండే ఎయిర్‌వాల్వ్‌ల నిర్వహణ విషయంలో జలమండలి అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. చాలా ప్రాంతాల్లో వాల్వ్‌ల చుట్టూ కంచె లేకపోవడంతో వాటి రక్షణ ప్రశ్నార్థకంగా మారింది. తాగునీటి పైపులైన్‌లలో బ్లాకేజీలు లేకుండా, సరైన ప్రెషర్‌తో నీటి సరఫరా అయ్యేందుకు ఎయిర్‌వాల్వ్‌లు ఉపయోగపడతాయి. ఇంత కీలకమైన ఈ వాల్వ్‌ల నిర్వహణలో అధికారులు పట్టీపట్టనట్లు వ్యవహరించడం విమర్శలకు తావిస్తోంది.

– రంగారెడ్డినగర్



చింతల్ ప్రధాన రోడ్డులో మూత లేని ఎయిర్‌వాల్వ్



షాపూర్‌నగర్ రోడ్డులోని నాలా పక్కనే మంజీర ఎయిర్‌వాల్వ్



యూపీహెచ్‌సీ సమీపంలో కంచె లేని ఎయిర్‌వాల్వ్

# ఫెన్సింగ్ వేయడంలో నిర్లక్ష్యం

అధికారుల తీరుతో కబ్జా అవుతున్న ప్రభుత్వ స్థలం

చింతల్: ప్రభుత్వ స్థలాలను పరిరక్షించడంలో అధికారుల బాధ్యతారాహిత్యం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. 25 గుంటల ప్రభుత్వ స్థలానికి ఏళ్లు గడుస్తున్నా ఫెన్సింగ్ వేయడంలో నిర్లక్ష్యం వహిస్తూ పరోక్షంగా కబ్జాదారులకు సహకరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. చింతల్ డివిజన్ భగత్‌సింగ్ నగర్‌లో ఉన్న ప్రభుత్వ స్థల విషయంలో కొన్నేళ్లుగా పక్కనే ఉన్న కబ్జాదారులు, అధికారులకు వివాదాం కొనసాగుతూ ఉంది.

◆ ఇటీవల ఈ ప్రభుత్వ స్థలంపై 'సాక్షి'లో పలు కథనాలు ప్రచురితమయ్యాయి. అయినా సంబంధిత డిప్యూటీ కమిషనర్, టౌన్ ప్లానింగ్, రెవెన్యూ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనేది స్పష్టంగా కనిపిస్తోంది. ఇటీవల మిగిలిన 3553 గజాల స్థలానికి ఫెన్సింగ్ వేసేందుకు నిధులు మంజూరైనా ప్రస్తుత డిప్యూటీ కమిషనర్, టౌన్ ప్లానింగ్ అధికారి చోద్యం చూస్తున్నారు. ఈ క్రమంలో కబ్జాదారులు సదరు స్థలంలో 7 నుంచి 9 గుంటల స్థలాన్ని 7 ప్లాట్లుగా చేసి విక్రయించేందుకు యత్నిస్తున్నా అధికారులు ఫెన్సింగ్ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

### పోలీస్ ప్రొటెక్షన్‌తో ఫెన్సింగ్ వేయాలి

2021లో ఇచ్చిన లేఔట్ ప్రకారం ఇప్పుడు ఉన్న డీసీ, టౌన్ ప్లానింగ్, ఇంజినీరింగ్ అధికారులు కలిసి పోలీస్ ప్రొటెక్షన్ సహాయంతో గతంలో ఇచ్చిన 3553 గజాలకు గాను ఫెన్సింగ్ పూర్తి చేయాల్సిందే. ఇటీవల డిప్యూటీ కమిషనర్ సర్వే పేరుతో కాలయాపన చేస్తూ జిల్లా కలెక్టర్‌కు, ఇతర అధికారులకు లేఖలు పంపినట్లు సమాచారం. గతంలో ఎమ్మార్వో, టౌన్ ప్లానింగ్ అధికారి ఇచ్చిన లేఅవుట్‌ను మార్చేందుకు అధికారులు యత్నిస్తున్నారు. గతంలో ఇచ్చిన లేఔట్ ప్రకారం ఫెన్సింగ్ పూర్తి చేయాల్సిందే.

– కేఎం ప్రతాప్, మాజీ డీసీసీ అధ్యక్షుడు



భగత్‌సింగ్‌నగర్‌లోని ప్రభుత్వ స్థలంలో గతంలో నాటిన కడీలు